ప్రమాదకరంగా తుఫాన్ రక్షిత భవనాలు

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తీర ప్రాంత గ్రామాల ప్రజలను సురక్షితంగా ఉంచేందుకు నిర్మించిన తుఫాన్ రక్షిత భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన వీటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో కూలిపోయే స్థితికి చేరాయి. వాటి స్థానంలో కొత్తభవనాలను నిర్మించేందుకు అధికారులు చొరవ చూపడం లేదు. దీంతో తుపాన్లు వచ్చిన సమయాల్లో తలదాచుకోవడానికి సరైన భవనాలు లేక మత్స్యకార గ్రామాల ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కాలం గడుపుతున్నారు.

- శిథిలావస్థకు చేరుకోవడంతో తీర ప్రాంతవాసుల్లో భయం.. భయం
- జనావాసాలకు సమీపంలో ఉండడంతో ఆందోళన
- తక్షణమే తొలగించాలని వేడుకోలు


వాడనర్సాపురంలో ప్రమాదకరంగా ఉన్న తుఫాన్ రక్షిత భవనం

రాంబిల్లి (యలమంచిలి): రాంబిల్లి మండలంలో తుఫాన్ రక్షిత భవనాలు ప్రమాదకరంగా మారాయి. వెంకయ్యపాలెం, వాడపాలెం, వాడనర్సాపురం, రాంబిల్లి, కొత్తపట్నం, కృష్ణంపాలెంలలో భవనాలు శిథిలావస్థకు చేరాయి. జనావాసాల మధ్య ఉన్న ఈ భవనాలను తొలగించకపోవడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియక బిక్కుబిక్కుమంటూ కాలంగడుపుతున్నారు. వాడనర్సాపురంలో శిథిలావస్థకు చేరిన తుపాను రక్షిత భవనం జనావాసాల మధ్య ఉంది. ఈ భవనానికి ఒక పక్క అంగన్‌వాడీ కేంద్రం భవనం, మరోపక్క ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉన్నాయి. దీంతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. విద్యార్థులు ఈ పరిసర ప్రాంతాలలోనే తిరుగుతుంటారని, జరగరానిది జరిగితే పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఈ భవనాన్ని తొలగించాలని కోరుతున్నారు. మిగతా శిథిల భవనాలను కూడా తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

ఇతర అవసరాలకు...

మండలం కేంద్రం రాంబిల్లి, పంచదార్ల, వెంకయ్యపాలెంలలో కొత్తగా మూడు భవనాలు నిర్మించినా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండడం లేదు. అవసరం లేని చోట పంచదార్ల, రాంబిల్లి గ్రామాల్లో తుపాను షెల్టర్లు నిర్మించారని ఆయా గ్రామస్తులు తెలిపారు. అధికారుల పర్యవేక్షణ లేక స్థానికులు తమ సొంత అవసరాలకు వీటిని వినియోగిస్తున్నారు. అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నేవల్‌బేస్ ప్రాజెక్ట్ కారణంగా కొత్తపట్నం, వాడనర్సాపురంలలో తుపాను షెల్టర్లు నిర్మించేందుకు అనుమతులు రాలేదని స్థానిక అధికారులు చెబుతున్నారు. ఈ గ్రామాల్లో తుఫాన్ రక్షిత భవనాలు లేకపోవడంతో ప్రకృతి వైపరీత్యాలు వచ్చిన సమయంలో స్థానికులు తీవ్ర అవస్థలకు గురతున్నారు. ఎక్కడ తలదాచుకోవాలో తెలియని పరిస్థితుల్లో సతమతమవుతున్నారు. మండలంలో నేవల్‌బేస్ నిర్వాసిత గ్రామాలైన వైలోవ,పెదకలవలపల్లి గ్రామాలు శారదానది ఒడ్డున ఉన్నాయి. వరదలు వచ్చినప్పుడు శారదానది ఉధృతంగా ప్రవాహించడం వల్ల ఆయా గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. ఇక్కడ కూడా తుఫాన్ రక్షిత భవనాలు నిర్మించవలసి ఉంది.


రాంబిల్లిలో శిథిలావస్థలో ఉన్న తుఫాన్ షెల్టర్

భయంగా ఉంది



వాడనర్సాపురంలో శిథిలావస్థకు చేరిన తుపాను రక్షిత భవనం పక్కనే అంగన్‌వాడీ భవనం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉన్నాయి. అంగన్‌వాడీ సెంటర్ చిన్నారులు, విద్యార్థులు శిథిల భవనం పక్కనే తిరుగుతూ ఉంటారు.ఎప్పుడు భవనం కూలిపోతుందో, ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకో లేదు.గ్రామంలో ప్రజాప్రతినిధులకు తెలియపరిచాం.ఇప్పటికైన అధికారులు స్పందించి శిథిల భవనాన్ని తొలగించాలి.

– కుమారి, అంగన్‌వాడీ టీచర్,వాడనర్సాపురం

భవనాల తొలగింపునకు చర్యలు



మండలంలో ఉన్న శిథిలభవనాలను గుర్తించి, తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. తుపాను రక్షిత భవనాలకు మరమ్మతులు చేయించి, ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు ప్రజలకు రక్షణ కల్పించే దిశగా కృషి చేస్తాం.

– శ్రీనివాసరావు, తహసీల్దార్, రాంబిల్లి మండలం

క్లుప్తంగా

గణపర్తి గ్రంథాలయం సందర్శన


రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వెంకటరావు

మునగపాక: మండలంలోని గణపర్తి గ్రంథాలయాన్ని బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటరావు సందర్శించారు. గ్రంథాలయంలోని రికార్డులను పరిశీలించి, పాఠకులకు అందుతున్న సేవలపై గ్రంథాలయాధికారి లంబా అప్పలనరసమ్మను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అసంపూర్తిగా ఉన్న డిజిటల్ గ్రంథాలయ భవన పనులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మారిశెట్టి వెంకటరమణ,చదరం లోవ తదితరులు పాల్గొన్నారు.

అడ్డురోడ్డు సీఐగా రామకృష్ణ బాధ్యతల స్వీకరణ


సీఐ రామకృష్ణను సత్కరిస్తున్న జ్యోతికుమార్

ఎస్.రాయవరం: అడ్డురోడ్డు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా రామకృష్ణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా పనిచేసిన అప్పన్నకు పాయకరావుపేట బదిలీ అయింది. బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణకు స్థానిక నాయకుల జ్యోతికుమార్, దమ్ము రాజు, గుర్రం రామకృష్ణ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి, అభినందనలు తెలిపారు.

అయ్యప్ప మాలధారులకు ఉచిత భిక్ష


ఉచిత భిక్ష కార్యక్రమంలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

ఎస్.రాయవరం: అయ్యప్ప మాలధారణ చేసిన భక్తులకు మండలంలోని తిమ్మాపురం నూకాంబిక అమ్మవారి ఆలయంలో ఉచిత భిక్ష, అల్పాహారాన్ని 41 రోజుల పాటు అందివ్వనున్నట్టు నిర్వాహకులు శివ, రామకృష్ణలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించినట్టు వారు చెప్పారు. ప్రతిఏడాది దీక్ష చేపట్టే భక్తులకు అల్పాహారం, మధ్యాహ్నం భిక్ష,రాత్రి వడి ఉచితం అందిస్తున్నట్టు వారు తెలిపారు.

మూలపేట అభివృద్ధికి సహకరించాలి


కార్యదర్శి గంగాధర్‌ను సత్కరిస్తున్న సర్పంచ్ గంగప్పలనాయుడు,ఉప సర్పంచ్ దేవీచంద్ర

మునగపాక: మూలపేట పంచాయతీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు కోరారు.మూలపేట పంచాయతీ కార్యదర్శిగా నియమితులైన గంగాధర్‌ను బుధవారం పాలకవర్గ సభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా గంగప్పలనాయుడు మాట్లాడుతూ పాలకవర్గ సభ్యులంతా గ్రామాభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర,పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

యలమంచిలి రూరల్: మండలంలోని ఏటికొప్పాక, ములకాపల్లి,కొత్తలి, పేరంటాలపాలెం, మన్యంపాలెం గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ (ఆపరేషన్స్) ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. దార్లపూడి సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ చినగుమ్ములూరు వాటర్ వర్క్స్ ఫీడర్‌కు సంబంధించి ఏటికొప్పాక వెళ్లే 11కేవీ లైన్‌లో, కొత్తలి ఫీడర్ లైన్‌లో విద్యుత్ పనులు చేపట్టాల్సి ఉన్నందున సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు మాత్రం విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు.

ఘనంగా సాంబశివుని రాట మహోత్సవం


మునగపాకలో సాంబశివుని రాట మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

మునగపాక: మండల కేంద్రం మునగపాకలో బుధవారం సాంబశివుని రాట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వచ్చే నెల 11వ తేదీన నిర్వహించనున్న సాంబశివుని శూలాల మహోత్సవాన్ని పురస్కరించుకుని రాట మహోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏటా కార్తీకమాసం రెండవ సోమవారం శూలాల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు, మళ్ల సంజీవరావు,దాడి శ్రీరామమూర్తి, దాడి శివ, పెంటకోట జగ్గప్పారావు, సత్యనారాయణ, కాశీ,వెలగా వెంకటప్పారావు,రామారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామ సభలు


తహసీల్దార్ నర్సింహమూర్తి

నక్కపల్లి: మండలంలో గతంలో రీ సర్వే చేసిన గ్రామాల్లో ఈ నెల 17 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఆర్. నర్సింహమూర్తి తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతోమాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామసభలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 17న రమణయ్యపేట,18న చిట్టిబట్ల అగ్రహారం,19న న్యాయంపూడి,21నజి.జగన్నాథపురం,22న రాజయ్యపేట,23న బుచ్చిరాజుపేట,24న చందనాడ,25ననల్లమట్టిపాలెం,26నగునిపూడి,28న ఎస్.నర్సాపురం,29న గొడిచర్ల,30న ముకుందరాజుపేట, నవంబరు 1న పెదబోదిగల్లం,2న దోసలపాడు,4న కాగిత,5న డొంకాడ గ్రామాల్లో ఈ గ్రామసభలు జరుగుతాయన్నారు. ఈ గ్రామాల్లో గతం భూరక్ష కార్యక్రమం కింద రీ సర్వే చేయడం జరిగిందని, రైతులకు అభ్యంతరాలున్నా, ఏమైనా సమస్యలున్నాఈగ్రామసభల్లోదరఖాస్తుచేసుకోవచ్చన్నారు.

పాయకరావుపేట : మండలంలోని పలు గ్రామాల్లో రీ సర్వే పై గురువారం నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ జి.సత్యనారాయణ తెలిపారు. భూముల రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో వచ్చేనెల 16 వరకు గ్రామ సభలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

ఎస్.రాయవరం: రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో గురువారం నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ జె.రమేష్‌బాబు తెలిపారు. 17న ధర్మవరం అగ్రహారం, 18న పెట్టుగోళ్లపల్లి, 19న ఎస్.రాయవరం, 22న వేమగిరి, 23న భీమవరం, 24న చినగుమ్ములూరు, 25న తిమ్మాపురంలలో గ్రామ సభలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

నేడు జగన్నాథపురంలో ..

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం జగన్నాథపురంలో గురువారం గ్రామసభ జరుగుతుందని తహసీల్దార్ జనార్ధనరావు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో గ్రామంలో నిర్వహించిన రీ–సర్వేలో లోపాలు లేదా సవరణలకు సంబంధించి జరిగే గ్రామ సభను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మలుపులొస్తే వణుకే


చౌడువాడ ఆర్‌అండ్‌బీ రహదారి

కోటవురట్ల: ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యంతో రహదారులు ప్రమాదకరంగా తయారయ్యాయి. ప్రధానంగా చాలా కాలంగా జంగిల్ క్లియరెన్స్ చేయించకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలతో మలుపు ల్లో తరచూప్రమాదాలు జరుగుతున్నాయి. రహదా రులను పిచ్చిమొక్కలు కమ్మేయడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించ వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. నర్సీపట్నం–రేవుపోలవరం మెయిన్‌రోడ్డు, చౌడువాడ, అన్నవరం, లింగాపురం, నీలిగుంట, పాములవాక, చినబొడ్డేపల్లి, రాజుపేట వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారుల్లో పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగిపోయి రహదారిపైకి వాలిపోతున్నాయి. అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్సు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

పల్లెల్లో క్షీణించిన పారిశుధ్యం


రామన్నపాలెంలోని వీధిరోడ్డు దుస్థితి

కోటవురట్ల: పల్లెల్లో అపారిశుధ్యం రాజ్యమేలుతోంది. నెలల తరబడి పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో మురికి కూపాలు, చెత్తకుప్పలతో కంపుకొడుతున్నాయి. ఏ గ్రామానికి వెళ్లినా మురికి కూపాలే దర్శనమిస్తున్నాయి. పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేకపోవడంతో దారుణంగా తయారయ్యాయి. రాజుపేట శివారు రామన్నపాలెంలో సీసీ రోడ్లు లేకపోవడంతో పలు వీధులు అధ్వానంగా ఉన్నాయి. ఇళ్లల్లోని వాడుకనీరంతా రోడ్లపైకి చేరి మురికి కూపాలు తయారయ్యాయి. దోమలు వ్యాప్తి చెంది రోగాలు ముసురుకుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పారిశుధ్య మెరుగుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని వేడుకుంటున్నారు.

తాండవ నీటి సంఘాల ఎన్నికలకు సన్నాహాలు

నాతవరం : తాండవ ప్రాజెక్టు నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ ఆదేశించారు. ఆయన బుధవారం తాండవ ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. కలెక్టరు ఆదేశాల మేరకు నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ సూచనల ప్రకారం పది రోజుల వ్యవధిలో తాండవ రిజర్వాయరు ఆయకట్టు పరిధిలో రైతుల ఓటరు జాబితా తయారు చేయాలన్నారు. ఉమ్మడి జిల్లాలోనే ఏకైక మేజరు ప్రాజెక్టు తాండవ రిజర్వాయరు కావడంతో నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి బాధ్యతగా వ్యవహరించాలన్నారు. తాండవ రిజర్వాయరు పరిధిలో నాతవరం, నర్సీపట్నం, కోటవురట్ల, పాయకరావుపేట, తుని, కోటనందూరు, రవతలపూడి మండలాల పరిధిలో ఆయకట్టు భూములు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో తాండవ ప్రాజెక్టు నాతవరం సెక్షన్ జేఈ సతీష్‌కుమార్, వర్కు ఇన్‌స్పెక్టరు అప్పారావు పాల్గొన్నారు.

ఈ- పంట నమోదుతో బహుళ ప్రయోజనాలు


మాట్లాడుతున్న వీఏఏ సింధూజ

మునగపాక: ప్రతి రైతు తప్పనిసరిగా ఈ–పంట నమోదు చేసుకోవాలని వీఏఏ సింధూజ కోరారు. ఈ–పంట నమోదులో భాగంగా మునగపాక సచివాలయంలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ–పంట నమోదు ద్వారా బహుళ ప్రయోజనాలు ఉంటాయన్నారు. రైతులు తమ భూముల్లో ఎటువంటి పంటల సాగు చేపడుతున్నారో గుర్తించి సంబంధిత యాప్‌లో నమోదు చేయనున్నట్టు చెప్పారు. రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



వరి పొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పాయకరావుపేట: రైతులు వరి చేనులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ తెలిపారు. మండలంలో ఈదటం, పాల్మన్‌పేట గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం వ్యవసాయ శాస్త్రవేత్త హరి మాట్లాడుతూ ఘన, ద్రవ, జీవా మృతాలు ఉపయోగంపై వివరించారు. ఈ కార్యక్రమాల్లో నీటి పారుదల శాఖ ఏఈ శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జీతాలు పెంచాలని కోరుతూ లారీ డ్రైవర్ల ఆందోళన

కశింకోట: బయ్యవరంలో ఉన్న సిమెంట్ పరిశ్రమ వద్ద సీఐటీయూఆధ్వర్యంలో బుధవారం వరుసగా మూడో రోజు తమ జీతాలు పెంచాలని కోరుతూ లారీ డ్రైవర్లు సమ్మె నిర్వహించి నిరసన తెలిపారు. గత ఏడేళ్లుగా జీతాలు పెంచకపోవడం శోచనీయమన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్. శంకరరావు, కమిటీ సభ్యుడు దాకారపు శ్రీనివాసరావు, డ్రైవర్స్ యూనియన్ నాయకులు గోవింద్, మణిబాబు, అప్పలనాయుడు, సురేష్ పాల్గొన్నారు.

శరవేగంగా వెంకన్న ఆలయ నిర్మాణం


నిర్మాణంలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయం

మునగపాక: మునగపాకలో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. బైపాస్ రోడ్డులో సువిశాల ప్రాంతంలో రూ.4 కోట్ల వ్యయంతో కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయ నిర్మాణం చేపట్టేందుకు గ్రామస్తులు నిర్ణయించారు. ఈ మేరకు ఆలయ నిర్మాణానికి సంబంధించి భక్తుల నుంచి విరాళాలు సేకరిస్తున్నారు. ఇప్పటికే పలువురు దాతలు తమవంతు సాయం అందించారు. గ్రామ పెద్దలంతా రాజకీయాలకు అతీతంగా ఇంటింటికీ వెళ్లి విరాళాలు సేకరిస్తున్నారు. ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛగా నిలిచిన వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని కమిటీ సభ్యులు కోరుతున్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి


మునగపాక హైస్కూల్ పీఈటీని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

మునగపాక: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మునగపాక జిల్లా పరిషత్ స్కూల్‌కమిటీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరావు తెలిపారు. స్కూల్‌గేమ్స్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో నియోజకవర్గ, జిల్లాస్థాయిల్లో రాణించిన విద్యార్థులను బుధవారం హైస్కూల్‌లో అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చిన పీఈటీని సత్కరించారు.

నేటి నుంచి వార్డు సభ్యులకు శిక్షణ

మునగపాక: స్థానిక మండల పరిషత్ హాలులో గురువారం నుంచి రెండు రోజుల పాటు ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు శిక్షణ ఇవ్వనున్నట్టు ఈవోఆర్డీ సోమరాజు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే శిక్షణ కార్యక్రమానికి ప్రతి పంచాయతీ నుంచి ఉపసర్పంచ్‌తో పాటు ఇద్దరేసి వార్డు సభ్యులు హాజరు కావాలన్నారు. విధి విధానాలపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. ఎంపీడీవో ఎం.ఉషారాణి, ఏవో ప్రసాద్‌లు ఈ కార్యక్రమంలో శిక్షణ అందజేస్తారన్నారు. ఈ అవకాశాన్ని వార్డు సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సోమరాజు కోరారు.

అభిజిత్ పరిశ్రమ లే-ఆఫ్ చట్టవ్యతిరేకం

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు


మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లోని అభిజిత్ కంపెనీ యాజమాన్యం ప్రకటించిన లే–ఆఫ్ చట్ట విరుద్ధమని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు అన్నారు. ఆ కంపెనీ కార్మికులు బుధవారం నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అభిజిత్ యాజమాన్యం కార్మికులను మోసగించడానికి అక్రమ లే–ఆఫ్ ప్రకటించిందని, ఇది చట్ట వ్యతిరేకమన్నారు. కార్మికులకు జీతాలు ఎగ్గొట్టడానికి పరిశ్రమ యాజమాన్యం కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. వెయ్యి కుటుంబాలు రోడ్డున పడడానికి కారణమైన కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కంపెనీ ఏర్పాటులో భాగంగా భూములిచ్చిన నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేసి ,తక్కువ జీతాలతో వెట్టి చాకిరీ చేయించడం సరికాదన్నారు.ప్రభుత్వం స్పందించి అక్రమ లే–ఆఫ్‌ను ఎత్తివేసి కార్మికులకు పనులు కల్పించాలని కోరారు. లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు,జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, రొంగలి రాము, రైతు సంఘ నాయకులు కర్రి అప్పారావు,సీఐటీయూ నాయకులు శివాజీ,రమణ,చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

నక్కపల్లి: మండలంలోని దేవవరం,గొడిచర్ల, ముకుందరాజుపేట,చీడిక,దోసలపాడు, రేబాకల్లో పల్లె పండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవవరంలో మాజీ ఎంపీపీ దేవర సత్యనారాయణ ఆధ్వర్యంలో పలు వీధుల్లో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో డి.సీతారామరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయమని చెప్పారు. సర్పంచ్‌లు గొర్ల రాఘవకుమారి,పాదిరెడ్డిశ్రీను,మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కురందాసు నూకరాజు, ఏఈ నరేంద్ర, నాగభూషణం, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: మండలంలోని రాజవరం, వెంకటనగరం, కేశవరం గ్రామాల్లో బుధవారం పల్లె పండగ కార్యక్రమాలు నిర్వహించారు. రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి అధికారులు శంకుస్థాపనలు చేశారు.

వరిలో తెగుళ్ల నివారణపై దృష్టి


కుంచంగిలో రైతులకు సూచనలిస్తున్న మండల వ్యవసాయాధికారి రంగాచారి

అనకాపల్లి: వరి పొలంలో తెగుళ్లు, పురుగుల ఉధృతి ఎక్కువగా ఉందని, వాటి నివారణకు రైతులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి పి.రంగాచారి అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని కూండ్రం, కుంచంగి గ్రామాల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో ఎంటీయూ–1075 ఆకు ముడత, పొడ తెగులును పరిశీలించామన్నారు. వాటి నివారణకు రెండు మిల్లీలీటర్ల హెక్సా కొనజోల్ మందును లీటర్ నీటికి, ఎసిఫేట్ 1.5 గ్రామ్స్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. బీపీటీ–5204 ఆకు ముడత నివారణకు క్లోరిఫైరిపాస్ లీటర్ నీటికి 2 మి.లీ. చొప్పున స్ప్రే చేయాలని, ఈ రకంలో దోమ ఉధృతికి గాను లీటర్ నీటికి 1.5 గ్రా. ఎసిపెట్ వేయాలన్నారు. వరిలో ఎకరానికి 25 కేజీల యూరియా, 15 కేజీల పోటాస్ వేయాల్సి ఉందన్నారు. బ్యాక్టీరియా ఎండు తెగుళ్ల(పండా ఆకు) నివారణకు ప్లాంటోమైసిన్ 100 గ్రాములు, పోటాస్ అందుబాటులో లేని కారణంగా 13–0–45 ఎకరానికి ఒక కేజీ చొప్పున పురుగు మందులతో కలిపి పిచికారీ చేయాలని రంగాచారి సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నందవరపు లక్ష్మీసూరిబాబు, ఎంపీటీసీ జెట్టి నాగమణి, రైతులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు వేయించాలి

కె.కోటపాడు : గొర్రెలు, మేకల పెంపకందారులు తప్పనిసరిగా ఏడాదికి మూడుసార్లు నట్టల నివారణ మందును వేయించాలని కె.కోటపాడు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దినేస్‌కుమార్ తెలిపారు. కె.కోటపాడు, గొండుపాలెం, గుల్లేపల్లి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. పశుసంవర్ధకశాఖ ద్వారా నట్టల నివారణ మందును వేసే కార్యక్రమం ఈ నెల 31 వరకూ జరగనున్నట్టు తెలిపారు. కె.కోటపాడు మండలంలో 17 వేలు, దేవరాపల్లి మండలంలో 16500 గొర్రెలు,మేకలకు నట్టల నివారణ మందు లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు.